వాయుగండం

- ఆందోళనలో అన్నదాతలు
- పంటను కాపాడుకునే పనిలో నిమగ్నం

రాయవరం: బంగాళాఖాతంలో తుపాను సంభవించడంతో రైతులు కలవరపడుతున్నారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు వారు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ఏర్పడిన తుపాను ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న ఆందోళన అన్నదాతలను వేధిస్తోంది. వరి పంట పండిన ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఇంకా పచ్చిగా ఉండగానే యంత్రాల సాయంతో హడావుడిగా కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఇళ్లకు చేరుస్తున్నారు.

గోరు చుట్టుపై రోకటి పోటులా..

ప్రస్తుతం అన్నదాతల పరిస్థితి గోరుచుట్టుపై రోకటి పోటు మాదిరిగా ఉంది. కొద్ది రోజుల కిందట కురిసిన వర్షాలకు మండపేట నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో వరి పంట నేలకొరిగింది. పడిపోయిన వరి దుబ్బులను రైతులు పైకి లేపి కట్టారు. వరి చేలు చాలా ప్రాంతాల్లో కోత దశకు చేరుకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అయితే తుపాను ప్రభావం మనకు ఏమేర ఉంటుందో స్పష్టంగా తెలియదు. వాతావరణ పరిస్థితులు అన్నదాతలను భయపెడుతుండడంతో కూలీల రేట్లు కూడా పెరగనున్నాయి. ఇది రైతులకు మరింత ఆర్థిక భారం కానుంది. పంటను కాపాడుకునే క్రమంలో కూలీలకు అధిక రేటు చెల్లించి మరీ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

దిగుబడిపై ప్రభావం

ప్రస్తుత పరిస్థితులు దిగుబడులపై ప్రభావం చూపనున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దిగుబడి తగ్గుతున్నట్టు పంట కోత ప్రయోగాల్లో నిర్ధారణ అవుతోంది. కురిసిన వర్షాలకు వరి చేను నేలనంటడంతో వరి కంకులు రాలిపోయి గింజలు పల్చబడడం, ఖరీఫ్‌లో ఎలుకల ప్రభావం అధికంగా ఉండడం వల్ల ఎకరాకు 8 నుంచి 10 బస్తాల వరకూ దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు భావిస్తున్నారు. దీనికితోడు పంట పువ్వారం దశలో ఉండగా కురిసిన వర్షాల వలన గింజలు గట్టి పడక తాలుగా మారడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోంది. గత ఖరీఫ్‌లో ఎకరాకు 30–40 బస్తాల వరకూ దిగుబడి వస్తే, ప్రస్తుత ఖరీఫ్‌లో 25–35 బస్తాల దిగుబడి కూడా కనాకష్టంగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

క్లస్టర్‌లో వ్యవసాయ పనులు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని మండపేట, రామచంద్రపురం, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. యంత్రాల వల్ల కోతలు వేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు 34 శాతం మేర వరి కోతలు పూర్తయినట్లు సమాచారం. ధాన్యాన్ని రహదారులపై తేమ శాతాన్ని తగ్గించుకోవడం కోసం ఆరబెట్టుకోవడంతో రహదారులన్నీ ధాన్యపు కళ్లాలుగా మారుతున్నాయి.



వరికోత యంత్రంతో సాగుతున్న వరికోతలు



రహదారిపై రైతులు ఆరబోసుకున్న ధాన్యం

రైతులకు పెద్ద కష్టమే

తుపాను హెచ్చరికల వల్ల రైతులకు పెద్ద కష్టమే రానుంది. పెట్టుబడులు పెట్టి, పంట చేతికి అందివస్తున్న సమయంలో ఏటా తుపానులు రైతులకు కడగండ్లను మిగులుస్తున్నాయి. తుపాను ప్రభావం లేకుంటే రైతులంతా గట్టెక్కుతారు.

– కె.బాలసుబ్రహ్మణ్యం, కౌలు రైతు, ఉండూరు, రామచంద్రపురం మండలం

ఆందోళన చెందవద్దు



ప్రస్తుత వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందవద్దు. ఇప్పటికే నూర్పిళ్లు చేసుకుని రహదారుల పైకి చేర్చిన ధాన్యాన్ని వర్షాలు వస్తే తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయశాఖ ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలి. వ్యవసాయ శాఖ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉంటారు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం

క్లుప్తంగా

సామాజిక పరిస్థితులపై అవగాహన అవసరం



అంగర పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై, మహిళా పోలీస్

కపిలేశ్వరపురం: విద్యార్థినులందరికీ సామాజిక పరిస్థితులపై అవగాహన అవసరమని అంగర ఎస్సై డి.రవికుమార్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై మహిళా రక్షణ పేరుతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా పోలీసు భవాని మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెబుతూ బయటి వారి ప్రవర్తనను గ్రహించే టెక్నిక్స్‌ను వివరించారు. చట్టాలు మహిళలకు రక్షణ కల్పిస్తాయన్నది ఎంత వాస్తవమో వ్యక్తిగతంగా జాగ్రత్తతో మసలుకోవాలన్న విషయానికి కూడా అంతే ప్రాధాన్యత ఉందని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు భూసార పరీక్ష ఫలితాల అందజేత



ఉండూరులో రైతులకు భూసార పరీక్ష ఫలితాలు అందజేస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరులో ఇటీవల నిర్వహించిన భూసార పరీక్షల ఫలితాలను మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ రైతులకు మంగళవారం అందజేశారు. ముందుగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్ష ఫలితాలు పంట సాగుబడిలో రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయన్న వివరాలను విపులంగా వివరించారు. ఈ ఫలితాలను బట్టి ఏ మోతాదులో ఎరువులు వాడాలి, భూసారం పెంచుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర వివరాలకు రైతులకు అర్థమయ్యే విధంగా మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సత్యనారాయణ, గ్రామ హార్టీకల్చర్ సహాయకుడు సుధీర్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వసతులు మెరుగుపరచాలి

కాజులూరు: మండలంలోని ఆర్యావటం శివారు తుమ్మలపల్లిలంకలో వసతులు మెరుగుపరచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మంగళవారం గ్రామాలలో బాధితులు పి.సుబ్రహ్మణ్యం, రాజు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీల ఏర్పాటు, మంచి నీటి సరఫరా, రహదారుల సదుపాయం లేక పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షం వస్తే వీధులన్నీ జలమయం అవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి ఈ శివారు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



రాయవరంలో నిర్వహిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణం

రాయవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా గల గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఏటా కార్తిక పౌర్ణమికి ముందుగా ఏకాదశి రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా నిర్వహించిన కల్యాణంలో తేతల సత్యనారాయణరెడ్డి, పడాల శ్రీనివాస రెడ్డి, పొడుగు వరప్రసాద్ దంపతులు పీటలపై కూర్చుని పూజాదికాలు నిర్వహించారు. అత్తిలి శివరామకృష్ణ శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు సూరిబాబు మాట్లాడుతూ చిల్కు ద్వాదశిని పురస్కరించుకుని ఆలయం వద్ద బుధవారం అఖండ దీపారాధన, ఈ నెల 14న పుష్పయాగం, 16న నగర ఊరేగింపు, 20న అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. కల్యాణాన్ని రాయవరం, మహేంద్రవాడ, వెదురుపాక, వి.సావరం, కొమరిపాలెం, లొల్ల తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు.

ఘనంగా శివస్వాముల రథోత్సవం



గొల్లపాలెంలో రథయాత్ర నిర్వహిస్తున్న శివస్వాములు

కాజులూరు: శివస్వాముల రథోత్సవం కాజులూరు, కరప, రామచంద్రపురం మండల గ్రామాల్లో మంగళవారం ఘనంగా సాగింది. కార్తికమాసం పురస్కరించుకుని గత వారం పెద్దాపురప్పాడు శివాలయంలో మండల పరిసర గ్రామాలకు చెందిన పలువురు భక్తులు శివ దీక్షలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బాదంపూడి నాగవెంకటసుబ్రహ్మణ్యం (పండుస్వామి) ఆధ్వర్యంలో శివస్వాములకు తోడు సుమారు 500 మంది భక్తులు పాల్గొని గొల్లపాలెం ధనమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి రథయాత్ర ప్రారంభించారు. అనంతరం మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, జగన్నాథగిరి, కరప మండలం పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, రామచంద్రపురం మండలం ఉండూరు, హసన్‌బాద, తోటపేటల మీదుగా స్వామివారి రథయాత్ర ద్రాక్షారామకు చేరుకుంది. ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయంలో శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది ఎంపిక



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులతో కళాశాల బృందం

రామచంద్రపురం: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వీఎస్ఎం విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు 25 మంది ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బాలాజీ తెలిపారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన మేన్‌పవర్ గ్రూప్ టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టులకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలల నుంచి 83 మంది డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వి.రవీంద్ర, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎన్ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

రేపు అంగరలో శివ పంచాక్షరి గ్రంథ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: అంగరలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 14న శివ పంచాక్షరి గ్రంథ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలతో పంచకోటి అక్షర గ్రంథాలతో ఆలయ ప్రవేశ కార్యక్రమం చేపడతామన్నారు. ఏకాదశి రుద్రాభిషేకం పూజలు చేస్తున్నామన్నారు. 16న ఆలయ ప్రాంగణంలో కార్తిక వన సమారాధన నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కపిలేశ్వరపురం: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి తెలిపారు. ఈ నెల 20వ వరకూ విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించనున్నామన్నారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినం, 17న చిత్రలేఖనం, 18న జనరల్ నాలెడ్జ్, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నామని శివకుమారి వివరించారు.

రాయవరం, మాచవరం గ్రంథాలయాల్లో..

రాయవరం: మండలంలోని రాయవరం, మాచవరం శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని లైబ్రేరియన్లు ఎస్.రత్నాబాయి, ప్రమీలలు మంగళవారం విలేకరులకు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గేయాలు, చిత్రలేఖనం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

రేపు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

మండపేట: గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లానింగ్ (జీపీడీపీ) యాక్షన్ ప్లాన్ 2025–26 శిక్షణ తరగతులను గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ తరగతులకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మండల అధికారులకు, డ్వాక్రా ప్రెసిడెంట్‌లకు కూడా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజాప్రతినిధులకు రెండో దశలో శిక్షణ ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

కోటిపల్లి పంటు ప్రయాణంపై ఆర్డీఓ ఆరా



కోటిపల్లి రేవును పరిశీలిస్తున్న ఆర్డీఓ అఖిల

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి రేవు నుంచి గోదావరి అవతలి గట్టుకి పంటు ప్రయాణంపై రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల ఆరా తీశారు. అధికారులతో కలసి మంగళవారం కోటిపల్లి గోదావరి తీరాన్ని పరిశీలించిన ఆర్డీఓ రేవు కాంట్రాక్టర్ పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను)ని పంటు ప్రయాణం ఎప్పటి నుంచి అందుబాటులోకి తీసుకువస్తారని ప్రశ్నించారు. దీనికి ఈ నెల 15 నుంచి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన సమాధానం ఇచ్చారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్, సర్పంచ్ పెమ్మాడి బేబి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహం



ఆర్యావటంలో భజన చేస్తున్న భక్తులు

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో సప్తాహ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్త కమిటీ సభ్యులు ఈ నెల ఐదో తేదీ మంగళవారం ఉదయం స్థానిక రామాలయంలో కలశ స్థాపన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. నాటి నుంచి నిర్విరామంగా భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దాంతో పాటు రోజూ రాత్రి ఆవునెయ్యితో జ్యోతిర్లింగార్చనలు, కుంకుమపూజలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 13వ తేదీ బుధవారంతో సప్తాహం పూర్తవుతుందని ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ శ్రేయస్సు దృష్ట్యా శ్రీరామచంద్రుడిని ప్రార్థిస్తూ ఈ సప్తాహం నిర్వహిస్తున్నామని పరిసర గ్రామాలకు చెందిన భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జయబాబు

కపిలేశ్వరపురం: రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండలంలోని మాచర గ్రామానికి చెందిన గుడాల జయబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీర్ఘకాలంగా టీడీపీ మండల కమిటీ కార్యదర్శిగా ఆయన పని చేస్తున్నారు. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, సీఎం చంద్రబాబులకు జయబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో కార్తిక ఏకాదశి పూజలు



ఏడిద గ్రామంలోని సంగమేశ్వర స్వామికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు

మండపేట: కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని, పట్టణంలోని వైష్ణవాలయాలు, శైవ క్షేత్రాల్లో విశేష పూజలు జరిగాయి. పట్టణంలోని రథం ఆలయంలోని అగస్త్యేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అనంతరం జనార్దన స్వామి ఆలయంలో స్వామివారికి సాలిగ్రామ అర్చనలు, దీప పూజలు నిర్వహించారు. మండలంలోని ఏడిద సంగమేశ్వర స్వామి ఆలయంలో స్వయంవర పార్వతీ సమేత సంగమేశ్వరస్వామికి విశేష పూజలు, అన్నాభిషేకం నిర్వహించారు. అలాగే ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. వెలగతోడు, పాలతోడు, ద్వారపూడి గ్రామాల శివాలయాల్లోను, కేశవరం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు దంపతులు వీరభద్ర స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జ్యోతిర్లింగార్చన



ద్రాక్షారామ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద జ్యోతిర్లింగార్చన

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కె.గంగవరం మండలం యర్రపోతవరం గ్రామానికి చెందిన కోలా నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. ఏటా వీరు జ్యోతిర్లింగార్చన నిర్వహించి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేస్తుంటారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యుమోనియా నుంచి చిన్నారులను రక్షించుకోవాలి



అంగరలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రత్నకుమారి

కపిలేశ్వరపురం: న్యుమోనియా వ్యాధి నుంచి చిన్నారులను రక్షించుకునే విషయమై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎన్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి ఆధ్వర్యంలో సాన్స్ కార్యక్రమంపై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ న్యుమోనియా వ్యాధి ఐదేళ్ల లోపు చిన్నారుల మరణాలకు కారణం అవుతుందన్నారు. లక్షణాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలన్నారు. దగ్గు, జలుబు, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకునే సమయంలో గురక రావడం, నీరు తాగలేకపోవడం, ఆహారం తినలేకపోవడం, ఛాతీ లోపలకు పోవడం, అధిక జ్వరం ఉండడమనే లక్షణాలు కన్పిస్తే అప్రమత్తం కావాలన్నారు. వ్యాధిపై ఇంటింటి ప్రచారం చేయడంతో పాటు లక్షణాలున్నవారిని గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ రుగ్మతలపై పోరాడాలి



అమర వీరులకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కె.గంగవరం: భూమి కోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం భారత విప్లవోద్యమాల్లో అసువులు బాసిన అమర వీరుల స్ఫూర్తిగా సమాజంలోని రుగ్మతలపై పోరాడాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని కె.గంగవరం శెట్టిబలిజ కల్యాణ మండపంలో మంగళవారం అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఐఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాకట్ల వెంకటేశ్వరరావు, రైతు కూలి సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాల వలన ధనవంతుడు ఇంకా ధనవంతుడు అవుతుంటే నిరుపేదలు ఏళ్ల తరబడి పేదరికంలోనే మగ్గిపోతున్నారన్నారు. సమాజంలో అంతరాలను తగ్గించడానికి అమర వీరుల స్ఫూర్తిగా ఉద్యమాలను విస్తరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చింతా రాజారెడ్డి, రావి భాను, కె.పనస రామన్న, చిర్రా సుగుణ, లక్ష్మి, కాశి లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు త్వరలోనే ప్రోత్సాహకాలు

- భవిత కేంద్రాన్ని సందర్శించిన ఐఈ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ సత్యనారాయణ

రాయవరం: దివ్యాంగులు సక్రమంగా పాఠశాలలకు వచ్చేందుకు వారికి ఏటా అందజేసే ప్రత్యేక ప్రోత్సహకాలను త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేయనున్నట్టు సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని సోమేశ్వరంలో భవిత కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి సంబంధించి హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ కింద 220 మందికి రూ.6.60 లక్షలు, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద 469 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.14.07 లక్షలు, ఎస్కార్ట్ అలవెన్స్ కింద 405 మందికి రూ.12.15 లక్షలు, గర్ల్ స్టైఫండ్ కింద 913 మంది దివ్యాంగ చిన్నారులకు రూ.18.26 లక్షలు చిన్నారుల తల్లుల ఖాతాల్లో త్వరలోనే జమ చేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీమ్ బాషా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే కదలికల్లో ఇబ్బందులున్న చిన్నారులకు ప్రతి వారం భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన చిన్నారులు వారి చిన్నారులను భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియో థెరపీ కేంద్రానికి తీసుకుని వచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఫిజియోథెరపీ కేంద్రాన్ని కూడా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. రోజువారీ ఐఈఆర్‌టీల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు పి.ఆదర్శ్, టి.వీరవేణి తదితరులు పాల్గొన్నారు.